క్లుప్తంగా

విద్యార్థులకు నోట్ పుస్తకాల వితరణ



పుస్తకాలను అందజేస్తున్న సంఘ నాయకులు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణ దేవాంగుల సంఘం ఆధ్వర్యంలో ఫాజుల్‌భాగ్‌పేట, బాదుర్లపేటలోని 100 మంది దేవాంగ పేద పిల్లలకు ఆదివారం నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రతి ఏడాది పుస్తకాల పంపిణీ, ఆర్థిక సాయం అందిస్తున్నామని సంఘ అధ్యక్షుడు గుంటముక్కల వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శి కాసిన సూర్యప్రకాశరావు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దొర సన్యాసిరాజు, గుత్తు చిన్నారావు, సభ్యులు కొనపల ప్రసాద్, జి.పాపారావు, ఎం.సత్యారావు, నల్ల అప్పారావు, చప్పటి లక్ష్మణరావు, నల్ల చిన్న బసవయ్య, గుర్తు మురళి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


లైన్‌సోయింగ్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి వ్యవసాయంలో లైన్ సోయింగ్ పద్ధతిలో విత్తనాలు నాటితే తెగుళ్లను నివారించవచ్చని రిసోర్సు పర్సన్ లక్ష్మునాయుడు అన్నారు. కుశాలపురంలో ఆదివారం లైన్ సోయింగ్ విధానంలో నాటడంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ విధానంలో కలుపు నియంత్రణ తేలిక అవుతుందని, ఎరువు వేసేటప్పుడు వృథా కాదని, మొక్క మొత్తానికి ఎండ తగులుతుందని చెప్పారు. విపత్తుల సమయంలో పంట నష్టం తక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రజిని, వెంకటరమణ పాల్గొన్నారు.

ఉత్తరేశ్వరునికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో ఉత్తరేశ్వరుడు

శ్రీకాకుళం కల్చరల్: బలగ ఉత్తరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మాసశివరాత్రి పూజలు నిర్వహించారు. వెండి గీర్వాలతో అర్చన, భస్మార్చనలు, మహా రుద్రాభిషేకాలు జరిగాయి. అనంతరం ఉత్తరేశ్వరున్ని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారిని ఆదిత్యుని కిరణాలు స్పృశించడంతో భక్తులు పారవశ్యం చెందారు.

ఉమారుద్రునికి ప్రత్యేక అలంకరణ



ఉమారుద్ర కోటేశ్వరస్వామి

శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలోని ఉమారుద్ర కోటేశ్వరస్వామి దేవాలయంలో మాస శివ రాత్రి పురస్కరించుకొని స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

సేవే పరమావధి



మాట్లాడుతున్న సత్యసాయి సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు లింగరాజు

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి సేవాదళ్ సభ్యులు సేవే పరమావధిగా ఉండాలని సత్యసాయి సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు వై.లింగరాజు అన్నారు. స్థానిక బ్యాంకర్స్ కాలనీ సాయి బృందావనంలో జోనల్ సేవాదళ్ శిక్షణ శిబిరం ఆదివారం జరిగింది. సేవా కార్యక్రమాల్లో పాల్గొనే కార్యకర్తలు ఎలా పనిచేయాలో వివరించారు. కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ సమన్వయకర్త సూర రామచంద్రరావు, అమ్మాయమ్మ, టీఎస్ఎన్ మూర్తి, పడాల ప్రసాదరావు, బోయిన నరసింహమూర్తి, పప్పల నాగేశ్వరరావు, ఎ.శివకుమార్, శశికాంత్, సూర్యకళ, కిల్లాన ఫల్గుణరావు, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నమో సూర్యదేవా..!



సూర్యనమస్కారాల పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

- ఆదిత్యుని విశేష పూజలు
- తరలివచ్చిన భక్తజనం
- ఇక ప్రతి ఆదివారం 'లోకల్' దర్శనాలు

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి దర్శనానికి ఆదిఆరం అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. ఆషాఢ మాసం ఆఖరి ఆదివారం సందర్భంగా స్థానికులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఉచిత దర్శనాలతో పాటు విశిష్ట, ప్రత్యేక దర్శనాల మార్గాల్లో స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు ప్రత్యేక సూర్యనమస్కారాల పూజలను చేయించుకున్నారు. ఎక్కడా ఇబ్బంది రాకుండా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రతి క్యూలైన్ వద్ద మంచినీటి ప్యాకెట్లు, ఉచిత ప్రసాదాలు అందజేయించారు. పలువురు దివ్యాంగులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. కేశఖండన శాలలో వందలాది మంది భక్తులు తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకోగా.. కలశాల పూజలతో సంప్రదాయంగా స్వామికి ప్రసాదాల నివేదన చేశారు. అంతరాలయంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, ఎస్.కోటేశ్వర చౌదరి తదితరులు భక్తులకు ఏర్పాట్లు పరిశీలించిన అనంతరం స్వామిని దర్శించుకున్నారు.

ఇక ప్రతి ఆదివారం లోకల్ దర్శనాలు..

ప్రతి ఆదివారం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు రెండు గంటల పాటు స్థానికులకు ఆధార్‌కార్డు చూపించితే..విశిష్ట దర్శనం (రూ.500) ఉచితంగా కల్పించాలని ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్ నిర్ణయించారు. ప్రధానార్చకులు శంకరశర్మ, ట్రస్ట్ బోర్డు సభ్యులతో చర్చించిన అనంతరం ప్రయోగాత్మకంగా ఆదివారం ఉదయమే ఈ విధానాన్ని అమలు చేశారు. దీంతో వచ్చే ఆదివారం నుంచి స్థానికులు ఆధార్‌కార్డు చూపి..విశిష్ట దర్శనాన్ని ఉచితంగానే పొందేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు సిబ్బందికి ఈవో ఆదేశాలు జారీ చేశారు.

సేవలు అభినందనీయం

గ్రామ, వార్డు వలంటీర్ల సేవలు అభినందనీయమని లబ్ధిదారులు కొనియాడుతున్నారు. పథకాలను చేరువ చేయడంలో అలుపెరుగని కృషి చేస్తున్నారని ప్రశంసిస్తున్నారు. కరోనా వంటి కష్టకాలంలో ప్రాణాలకు తెగించి సేవలు అందించారని గుర్తు చేసుకుంటున్నారు. అటువంటి నిస్వార్థ సేవలకు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆరోపణలు చేయడం సరికాదని మండిపడుతున్నారు.

– లావేరు/ఎచ్చెర్ల క్యాంపస్

భరోసా కల్పిస్తూ..



గతంలో వృద్ధాప్య పింఛన్ కోసం ఇబ్బందులు పడేవాడిని. పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. చేతికి డబ్బులు అందేందుకు రెండు మూడు రోజులు పట్టేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక వలంటీర్ నారాయణమ్మ తలుపుతట్టి వేకువజామునే పింఛన్ అందజేస్తోంది. ప్రతి పథకం వివరాలు తెలియజేస్తున్నారు. వలంటీర్ వ్యవస్థతో మాలాంటి వారికి ఎంతగానో ప్రయోజనం కలుగుతుంది.

– మొదలవలస సింహాచలం, ఫరీదుపేట

అండగా నిలుస్తున్నారు..



నేను అనారోగ్యానికి గురికావడంతో రాగోలు జెమ్స్ ఆసుపత్రిలో చేరాను. గ్రామంలో పింఛన్ డబ్బులు తీసుకోవడానికి వీలుకాలేదు. ఖర్చులకు ఇబ్బందులు పడుతున్న సమయంలో మా గ్రామ వలంటీర్ నాగం సింధు జెమ్స్ ఆసుపత్రికి వచ్చి పింఛన్ డబ్బులు అందజేసింది. గతంలో పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరిగినా చేతికి డబ్బులు అందేవి కావు. ఇప్పుడా పరిస్థితి లేదు. వలంటీర్లు బాగా సేవలు అందిస్తున్నారు.

– యాలాల ఆదినారాయణ, గుమడాం గ్రామం, లావేరు మండలం

మోడల్ స్కూల్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న నిర్వాహకులు

జి.సిగడాం: స్థానిక ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్/కళాశాల్లో చదువుతూ ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన మాస్టర్ మైండ్ సంస్థ నిర్వామకులు షరీఫ్, అంజిరెడ్డి ప్రతిభా పురస్కారాలు అందించారు. కళాశాలకు చెందిన సింహాద్రి అర్చన, మీసాల తరణ్, ధర్మాన మేఘనాథ్, యాగాటి రమణి, కోలా బాలాకుమారి, కె.పూజిత, కె.రేణుక, కె.వసంతలకు అవార్డులు ప్రదానం చేశారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లంక, అధ్యాపకులు మజ్జి ఈశ్వర్ నాయుడు, చీరాపు రవికుమార్, లక్ష్మణరావు, పిచ్చిక నేతాజీ, కె.తిరుపతిరావు, డి.ప్రమీల, జ్యోత్స్న, నాగమణి, ఉషారాణి, అరుణకుమారి అభినందించారు.

యువతి అదృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలో ఓ యువతి అదృశ్యమైనట్లు శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపారు. నగరంలోని మేదరవీధికి చెందిన విద్యార్థిని కత్తెర వీధిలో రూమ్ అద్దెకు తీసుకుని ప్రైవేటు కళాశాలలో డిగ్రీ సెకెండియర్ చదువుతోంది. ఈ నెల 14న తల్లి ఆరోగ్యం బాగోలేనందున మేదరవీధి వచ్చింది. అదేరోజు రాత్రి తన స్నేహితురాలింటికి వెళ్లివస్తానని చెప్పిన యువతి మరుసటి రోజైనా తిరిగి రాకపోవడంతో ఆచూకీ కోసం ప్రయత్నించారు. అదే రోజు తన సోదరుడికి.. అన్నయ్యా నేను వెళ్లిపోతున్నాను. నన్ను వెతకవద్దు.. మీరు జాగ్రత్తగా ఉండండి అంటూ.. సెల్ ఫోన్‌కు మెసేజ్ పంపింది. దీంతో ఆందోళనకు గురైన తల్లి ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలో ఓ విద్యార్థిని అదృశ్యమైనట్లు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బలివాడ గణేష్ పేర్కొన్నారు. పొందూరు మండలం తోలాపి గ్రామానికి యువతి స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతుంది. ప్రతిరోజూ తన మామయ్య ద్విచక్రవాహనంపై కళాశాలకు వెళ్లి తిరిగి ఆటోలో ఇంటికి చేరుకునేది. ఈ క్రమంలో ఈ నెల 14న కళాశాలకు పరీక్ష రాయడానికి మామయ్యతో కలిసి వెళ్లిన యువతి.. ఇంటికి చేరకపోవడంతో స్నేహితులు, బంధువుల వద్ద ఆచూకీ కోసం ప్రయత్నించారు. జాడ తెలియకపోవడంతో తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే కిరణ్



వై.వి.సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

రణస్థలం: టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ ఇన్‌చార్జి వై.వి.సుబ్బారెడ్డిని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆదివారం విశాఖలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన్ను కలిసిన వారిలో జి.సిగడాం మండల ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ తదితరులు ఉన్నారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం



రణస్థలం: చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



లావేరు: లావేరు గ్రంథాలయంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లైబ్రేరియన్

రణస్థలం: పుస్తక పఠనంతో విజ్ఞానం లభిస్తుందని రణస్థలం శాఖా గ్రంథాలయాధికారి పి.వరలక్ష్మి అన్నారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక గ్రంథాలయంలో దినపత్రికలు, కథలు చదివించడం రాయించడం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

లావేరు: దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన నాయకులను మరువలేమని లావేరు, మురపాక శాఖా గ్రంథాలయాధికారులు మురపాక శ్రీనివాసరావు, తలే రాంబాబు అన్నారు. లావేరు, మురపాక శాఖా గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు దేశ నాయకుల జీవిత చరిత్రలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. గ్రంథాలయానికి రావడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు ఎ.గడ్డెయ్య, పి.షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం గ్రంథాలయంలో చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో తెనాలి రామకృష్ణ హాస్య కథలు చదివించటం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి మలిపెద్ది చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు సెలవుల్లో గ్రంథాలయాలకు రావటం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.



ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులతో గ్రంథాలయ అధికారి చంద్రశేఖర్‌రావు



లావేరు: మురపాక గ్రంథాలయంలో నాయకుల జీవిత చరిత్రను చదివిస్తున్న లైబ్రేరియన్

క్యాన్సర్ రోగికి ఆర్థిక సాయం



సాయాన్ని అందజేస్తున్న సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: కేదారిపురం గ్రామానికి చెందిన అనపాన చంద్రయ్య భార్య శ్యామల కొంత కాలంగా క్యాన్సర్‌తో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పేద కుటుంబం కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న కేదారిపురం గ్రామానికి చెందిన కేపీఎం గల్ఫ్ ఫౌండేషన్ గ్రూప్ సభ్యులు తమవంతు సాయానికి ముందుకొచ్చారు. తమవంతు రూ. 23 వేలు, గ్రామ ప్రజలు రూ.25 వేలు సేకరించి..మొత్తం 48 వేల రూపాయలను బాధితురాలి భర్త చంద్రయ్యకు ఆదివారం అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు.

వ్యాసమంజరి పుస్తక పరిచయం



అప్పన్నను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక ఉపనిషన్మందిరంలో రచయిత డాక్టర్ నిక్కు అప్పన్న రచించిన వ్యాసమంజరి పుస్తక పరిచయ కార్యక్రమం ఆదివారం జరిగింది పుస్తకంలోని ప్రథమ భాగాన్ని డాక్టర్ సనపల నారాయణమూర్తి, ద్వితీయ భాగాన్ని డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, తృతీయ భాగాన్ని డాక్టర్ పి.శాంతమ్మలు విపులంగా వివరించారు. అనంతరం రచయితను సత్కరించారు. కార్యక్రమంలో పైడి హరనాథరావు, శరత్‌బాబు, పి.సాయిప్రసాద్, ఎం.వెంకటరమణ, జి.విశ్వేశ్వరరావు, నర్సునాయుడు, సత్యవతి, అనూరాధ పాల్గొన్నారు.

19 నుంచి అఖండ సంపూర్ణ రామాయణ పారాయణం



పతాకాలతో అనంత భారతి ఆర్ష విజ్ఞాన వాటిక ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్ : ఈ నెల 19 నుంచి స్థానిక అనంత భారతి ఆర్ష విజ్ఞాన వాటిక ఆధ్వర్యంలో 72 గంటల సంపూర్ణ రామాయణం సామూహిక పారాయణ చేస్తున్నట్లు నిర్వాహకులు భాస్కరభట్ల శ్రీరామశర్మ తెలిపారు. ఆర్షవిజ్ఞాన వాటికలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయణ పారాయణానికి ముట్నూరు శ్రీనివాసశాస్త్రి (బొబ్బిలి), సవితా శ్రీకాంత్ (రాజమండ్రి), సుందర పవన్ శర్మ(హైదరాబాద్), కట్టమూరి చంద్రశేఖర్ (విశాఖ), అయ్యసోమయాజుల శ్రీరామమూర్తి(విజయనగరం) తదితరులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ నెల 22న ఉదయం స్వామివారి ఊరేగింపు అనంతరం శాంతికల్యాణం జరుగుతుందని, నాలుగు రోడ్ల కూడలిలో విశేష లక్ష పుష్పార్చన జరుగుతుందని వివరించారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

జి.సిగడాం: గ్రామాల్లో రైతుల భూ సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ సేతుభీమవరంలో ఇనాం భూములపై దృష్టి సారించామన్నారు.

విత్తనశుద్ధిపై అవగాహన

కాశీబుగ్గ: ప్రకృతి వ్యవసాయ కార్యక్రమంలో భాగంగా మోదుగులపుట్టి గ్రామంలో విత్తనశుద్ధిపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఏపీ సీఎన్ఎఫ్ ఎస్‌డీఏ సీహెచ్ నాగరాజు ఆధ్వర్యంలో బీజామృతంతో సామూహికంగా రైతులందరిచే విత్తనశుద్ధి చేసే విధానాన్ని వివరించారు. ఖరీఫ్ సీజన్‌లో వరి పంటను సాగు చేయాలనుకునే రైతులు ముందుగానే విత్తనాలను శుద్ధి చేసుకుంటే మొలక శాతం బాగా వస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి సిబ్బంది ఉంగ సనత్‌కుమార్ పాల్గొన్నారు.

ధనరాజులమ్మకు పూజలు

ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న లొద్దపుట్టి ధనరాజులమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రా, ఒడిశా గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకొని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కాళీమాత వేషధారణ, కోలాటం, కోయి నృత్యాలతో అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగించారు.

అంతర్‌రాష్ట్ర క్రికెట్‌టోర్నీ విజేత పూరీ



బహుమతులు అందజేస్తున్న టోర్నమెంట్ నిర్వాహకులు

ఇచ్ఛాపురం: స్థానిక సురంగి రాజా క్రీడా మైదానంలో ఐసీసీ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 15 రోజులుగా జరుగుతున్న భానుమతి నరసింగరావు మెమోరియల్ అంతర్‌రాష్ట్ర సీజన్ –1 టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. విజేతగా పూరీ జట్టు నిలిచింది. ఒడిశాకు చెందిన బరంపురం లీడ్స్, పూరీ జట్లు ఫైనల్‌లో ఆదివారం తలపడ్డాయి. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పూరీ జట్టు నిర్ణీత 14.4 ఓవర్లలో 119 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బరంపురం లీడ్స్ జట్టు 15 ఓవర్లలో 109 పరుగులకే కుప్పకూలింది. దీంతో పది పరుగుల తేడాతో పూరీ జట్టు విజేతగా నిలిచింది. విన్నర్‌గా నిలిచిన పూరీ జట్టుకు రూ. 22,222, రన్నరప్‌గా నిలిచిన బరంపురం లీడ్స్ జట్టుకు రూ. 16,666ప్రైజ్‌మనీ, షీల్డ్‌లతో సత్కరించారు. మ్యాన్‌ఆఫ్ ద సిరీస్‌గా సునీల్ పాణిగ్రాహి (బరంపురం లీడ్స్), బెస్ట్‌బౌలర్‌గా సంతోష్ మిశ్రా (బరంపురం లీడ్స్), బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా సునీల్ పాణిగ్రాహి (బరంపురంలీడ్స్), బెస్ట్ ఫీల్డర్‌గా చిన్ను (కవిటి) ఎంపికయ్యారు. ముగింపు కార్యక్రమంలో భానుమతి నరసింగరావు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్ –1 అధ్యక్షుడు సామినేని గోపాల్, స్పాన్సర్స్ నర్తు శేశగిరిరావు, వెచ్చా కేశవరావు, ఉప్పాడ ఆనంద్, స్థానిక వైద్యులు డాక్టర్ ఉలాల శేషుయాదవ్, ఐసీసీ జట్టు అధ్యక్షుడు దాసరి రాజు పాల్గొన్నారు.

పలాసకు చేరిన జీపుజాతా



మాకన్నపల్లిలో మాట్లాడుతున్న రైతు సంఘ నాయకులు

పలాస: జీడి పిక్కలకు మద్దతు ధర ఇవ్వాలని కోరుతూ చేపట్టిన జీపుజాతా ఆదివారం ఉదయం పలాసకు చేరింది. మామిడిపల్లి, బొడ్డపాడు, మాకన్నపల్లి, నీలావతి, గురుదాసుపురం, గొల్లమాకన్నపల్లి, లొత్తూరు తదితర గ్రామాల్లో మద్దతు ధర కోసం జీడి రైతాంగాన్ని ఆటా పాటలతో చైతన్యం చేశారు. ఈ నెల 18న కాశీబుగ్గ సంతమైదానంలో జరగనున్న మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. 80 కిలోల జీడి పిక్కల బస్తాను రూ.16 వేలకు రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని జీడి రైతుల సంఘం కన్వీనరు తెప్పల అజయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. జిల్లా రైతు సంఘం నాయకుడు కె.మోహనరావు మాట్లాడుతూ.. మూడు నెలలుగా అనేక ఉద్యమాలు చేసినప్పటికీ అధికారులు స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడంతో రైతులు తప్పని పరిస్థితిలో అతి తక్కువ ధరకు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు కె.హేమసుందర్, గణపతి, కుత్తుం వినోద్, బత్తిన వీరాస్వామి, తెప్పల సింహాద్రి, సవర సురంగి, వివిధ గ్రామాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.